క్లుప్తంగా

హిందీతోనే అభివృద్ధి



పోస్టు కార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కంచిలి: హిందీ భాష నేర్చుకోవడం ద్వారానే అన్నివిధాలు అభివృద్ధి సాధ్యమవుతుందని హిందీ భాషా ప్రచారకుడు నిరంజన్ ఖడంగా అన్నారు. భాషా పక్షోత్సవాలు 14వ రోజు కార్యక్రమంలో భాగంగా బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం రాజా రామ్మోహన్‌రాయ్ వర్ధంతి, భగత్ సింగ్ జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. హిందీ భాషను ప్రాథమిక స్థాయి నుంచి అమలు పర్చాలని కోరుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖమంత్రి పేర్లతో రాసిన పోస్టుకార్డులను ప్రదర్శించారు.

వంశధార కాలువ గట్టు ఆక్రమణ!



కోటబొమ్మాళి మండలం కన్నేవలస సమీపంలో కాలువ గట్టుపై ఆక్రమణకు సిద్ధం చేసిన దృశ్యం

టెక్కలి: వంశధార కాలువ గట్లు ఆక్రమణలకు గురవుతున్నాయి. కోటబొమ్మాళిలో జాతీయ రహదారికి ఆనుకుని కొంతమంది శాశ్వత, మరికొందరు తాత్కాలిక నిర్మాణాలతో గట్టును ఆక్రమించేస్తున్నారు. కొంతమంది గట్టును ఆక్రమిస్తూ వాటిని ఏకంగా అద్దెలకు ఇచ్చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ ఆక్రమణలపై చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే ఆయా పంచాయతీ పరిధిలో అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా వంశధార అధికారులు దృష్టి సారించకపోతే భవిష్యత్‌లో కాలువ గట్లుపై భారీ నిర్మాణాలు చోటు చేసుకుంటాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

జీఎస్టీ పొదుపుపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న కూర్మారావు

మందస: స్వయంశక్తి సంఘాల మహిళలకు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. జిల్లుండ గ్రామంలోని స్వయంశక్తి సంఘాల పుస్తకాలను శనివారం పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం వస్తు వినియోగ పన్నును తగ్గించడం ద్వారా అధిక ధరలు తగ్గి పేద, మధ్య తరగతి వర్గాలకు నిత్యావసర, గృహావసర వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. దీనివల్ల సాధారణ ప్రజానీకానికి కొనుగోలు శక్తి పెరుగుతోందని వివరించారు. రైతులకు ఉపయోగపడే ట్రాక్టర్లు, బైకులు, ఏసీలు, కూలర్లు, ఇంటికి ఉపయోగించే విద్యుత్ పరికరాలపై ప్రభుత్వం వస్తుసేవల పన్నులను తగ్గించినట్టు పేర్కొన్నారు. సమావేశంలో వీవోఏ కేశమ్మ, గ్రామ అధ్యక్షులు శ్రీదేవి, క్లస్టర్ కోఆర్డినేటర్ మీనాక్షి, బాలకృష్ణ, స్వయంశక్తి సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

బైపల్లిలో పారిశుద్ధ్య పనులు



జేసీబీ సాయంతో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు రూరల్: బైపల్లిలో సర్పంచ్ డొంక ఉష ఆధ్వర్యంలో యంత్రాల సాయంతో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు శనివారం చేపట్టారు. రహదారులు, కూడళ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త చెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలిగించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలు కుండా పారిశుద్ధ్య పనులు చేపట్టినట్టు సర్పంచ్ చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు డొంక విద్యాసాగర్, పంచాయతీ కార్యదర్శి పనులను పర్యవేక్షించారు.

రాకపోకలకు అంతరాయం



రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

కవిటి: ముత్యాలపేట నుంచి ఎస్‌కేఈ రోడ్డుకు వెళ్లే రహదారిలో శనివారం తెల్లవారుజామున వర్షం కారణంగా రోడ్డుపక్కన ఉన్న మర్రిచెట్టు విరిగిపడింది. రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే రాకపోకలకు అంతరాయం కలిగింది. వాహనదారులంతా వెనకకు తిరిగి వేరే రూటులో వెళ్లాల్సి వచ్చింది. స్థానిక సర్పంచ్ కాయ దమయంతి అధికారులకు సమాచారం చేరవేశారు. జేసీబీని తీసుకొచ్చి చెట్టును తొలగించి, వాహనాల రాకపోకలకు మార్గాన్ని సుగమం చేశారు.

దుర్గమ్మా శరణు..శరణు..



నందిగాం: లలితా త్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చిన నీలమణిదుర్గ



సోంపేట: లలితా త్రిపుర సుందరీ దేవిగా సోమపోలమాంబ



ఇచ్ఛాపురం: కాత్యాయనిదేవీగా స్వేచ్ఛావతి అమ్మవారు



ఇచ్ఛాపురం రూరల్: లలితా త్రిపుర సుందరి అవతారంలో తులసిగాం వైదేహి అమ్మవారు



కవిటి: గొండ్యాలపుట్టుగలో లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

దుర్గమ్మతల్లి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజైన శనివారం అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరిస్తున్నాయి.

–సాక్షి నెట్‌వర్క్

కార్యకర్తలు, ప్రజలకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నాయకులు

- వైఎస్సార్‌సీపీ కుటుంబాలకు అండగా ఉంటాం
- జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసి వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులను అనేక ఇబ్బందులకు గురి చేసిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. ఈ నేపథ్యంలో వీరందరికీ వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ ద్వారా అండగా నిలుస్తామని వెల్లడించారు. ఇచ్ఛాపురం పట్టణం స్వేచ్ఛానగర్‌లోని రోటరీ ఫంక్షన్ హాల్‌లో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు అండగా నిలిచేందుకు తీసుకొచ్చిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణను పార్టీ నాయకులతో కలిసి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ కుటుంబంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు ప్రజలపై కూటమి ప్రభుత్వం అండతో టీడీపీ వర్గీయులు ఆల్లర్లకు పాల్పడడం, అన్యాయానికి గురిచేస్తే అలాంటివారి వివరాలను డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి వారి వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. బాధితుల తరపున న్యాయపరమైన పోరాటం చేయడానికి వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతదివ్య, ఎంపీపీలు బోర పుష్ప, పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండలాల అధ్యక్షులు ప్రకారావు పట్నాయక్, పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, ముఖ్యనాయకులు ఇప్పిలి కృష్ణారావు, కారింగి మోహన్‌రావు, పిలక సంతు, వజ్జ బాబురావు, ఎస్.బాబారావు, కాళ్ల సత్యం, సల్ల దేవరాజు, నీలాపు డిల్లి, నర్తు ప్రేమ్, వివేకానంద, కాళ్ల మదన్, బదకల మోహన్‌దాస్, సుగ్గు ప్రేమ్‌కుమార్, బచ్చు జగన్, సీహెచ్ తిరుపతి, సాలిన డిల్లీ, ధర్మతేజ, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

29న మున్సిపల్ సమావేశం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని 23 వార్డులలో అభివృద్ధి పనుల నిమిత్తం ఈ నెల 29వ తేదీన మున్సిపల్ సాధారణ సమావేశం జరగనుంది. ఈ విషయాన్ని చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

ఆదిత్యలో ఘనంగా దసరా వేడుకలు



దసరా ఉత్సవాల్లో భాగంగా ఆపరేషన్ సిందూర్ ప్రదర్శన

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఘనంగా దసరా వేడుకలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులంతా దసరా ఉట్టిపడే విధంగా వివిధ వేషధారణలతో అలరించారు.

పారిశుద్ధ్యం మెరుగుపర్చాలి

- జిల్లా అసిస్టెంటు కలెక్టర్ పృథ్విరాజ్ కుమార్



మురుగు కాలువను పరిశీలిస్తున్న పృథ్విరాజ్ కుమార్

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని జిల్లా అసిస్టెంటు కలెక్టర్ పృథ్విరాజ్ కుమార్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలో శనివారం పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితిని పరిశీలించారు. మొగిలిపాడు జంక్షన్, కాశీబుగ్గ సంత మైదానం ఉదయపురం ఏకాంబరేశ్వరి గుడి వీధి, కాశీబుగ్గ ఆంధ్రాబ్యాంకు రోడ్డు పరిసరాల్లో పర్యటించి శానిటేషన్ జరుగుతున్న తీరును పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. నెలవారీ యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని శానిటేషన్‌ను మెరుగుపర్చాలన్నారు. పురపాలక సంఘం సరిహద్దు గ్రామమైన ఉప్పరపేటలోను, కాశీబుగ్గ డంపింగ్‌యార్డును కూడా పరిశీలించారు. డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తను చూసి ఎందుకు అంత చెత్త పేరుకుపోయిందని ప్రశ్నించారు. శాగ్రిగేసన్ షెడ్లను పరిశీలించారు. కమిషనర్ నడిపేన రామారావుతో పాటు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సోంపేట: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ శనివారం తెలిపారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధ్యక్షతన ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అప్పలస్వామి

కంచిలి: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసరాలు, ఇతర ధరలు తగ్గింపు జరిగేందుకు వీలుగా తీసుకున్న చర్యలపై అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ కె.అప్పలస్వామి సూచించారు. ఈ మేరకు సచివాలయ సిబ్బందితో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మహిళల అభ్యున్నతికి సాకారం చేసే విధంగా కేంద్రం జీఎస్టీ తగ్గింపుతో సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని ఎంపీడీవో వి.తిరుమలరావు పేర్కొన్నారు. తగ్గిన జీఎస్టీ రేట్లు మహిళా సాధికారతకు బాటలు వేస్తున్నాయన్నారు. రోజువారీ ఉపయోగించే చాలా వస్తువులపై జీఎస్టీ తగ్గింపు ప్రభావం ఉంటుందన్నారు. జీఎస్టీ శ్లాబ్ మారిన నేపథ్యంలో తగ్గిన ధరలు అమలు చేస్తున్నదీ లేనిదీ దుకాణాలకు వెళ్లి పరిశీలించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రస్వామి, ఐకేపీ ఏపీఎం అప్పలనర్సమ్మ, ఏపీవో జి.ధనుంజయ పాల్గొన్నారు.

కులాన్ని ఉద్దేశించి మాట్లాడకూడదు

- జడ్జి కిశోర్‌బాబు



మాట్లాడుతున్న జడ్జి కిశోర్‌బాబు

సోంపేట: సమాజంలో కులాన్ని ఉద్దేశించి తక్కువగా మాట్లాడకూడదని, అలా ప్రవర్తిస్తే చట్టపరంగా శిక్షార్హులు అవుతారని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి కె.కిశోర్‌బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అట్రాసిటీ, ఎస్సీ, ఎస్టీ తదితర చట్టాలపై శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులాన్ని ఉద్దేశించి మనుషులను తేడాగా చూడకూడదని, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన వారిని తక్కువ చేసి మాట్లాడకూడదన్నారు. కులాన్ని బట్టి వ్యత్యాసం చూపించకూడదన్నారు. చట్టాల గురించి పూర్తి అవగాహన కలిగిఉండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ న్యాయమూర్తి కె.శ్రీనివాస్, సీఐ బి.మంగరాజు, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, న్యాయవాదులు ఎం.సర్వేశ్వరరావు, బి.రుక్మాంగధరావు, మండల పరిషత్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి శివసాగర్ తీరంలో శనివారం నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులు ,యువతి యువకులు జానపద పాటలకు నృత్యాలు చేస్తూ అలరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, పలాస నియోజకవర్గ ప్రత్యేకాధికారి మధుసూదనరావు మాట్లాడుతూ.. జిల్లాలో పర్యాటక కేంద్రానికి విశాల సముద్ర తీరం అనువుగా ఉందన్నారు. సంపద సృష్టికి ఈ వనరులు దోహదం చేస్తాయన్నారు. ఎంపీడీవో రమేష్ నాయుడు, నీలకంఠేశ్వర ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్దు నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పి.విఠల్, మండల టీడీపీ అధ్యక్షులు సురాడ మోహన్‌రావు, వ్యవసాయ పరపతి సంఘ డైరెక్టర్లు రాపాక శాంతమూర్తి, కోనేరు ఆదినారాయణ, అంబటి రామకృష్ణ ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

చిరు వ్యాపారులకు పీఎం స్వనిధి రుణాలు



మాట్లాడుతున్న పీడీ వెంకటరావు

పలాస: చిరువ్యాపారులు, వీధి విక్రయదారులకు పీఎం స్వనిధి 2.0 ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్టు మెప్మా ప్రాజెక్టు డైరెక్టరు ఎస్.వెంకటరావు చెప్పారు. పలాస-కాశీబుగ్గ మెప్మా ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో శనివారం చిరువ్యాపారులు, స్వయంశక్తి సంఘాల గ్రూపులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి విడతలో రూ. 15 వేలు, రెండో విడతలో రూ.25 వేలు, మూడో విడతలో రూ. 50 వేలు రుణాలు అందజేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇండియన్ బ్యాంకు మేనేజరు శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలను వివరించారు. సిటీ మిషన్ మేనేజరు మోహనరావు వీధి వ్యాపారులు డిజిటల్ లావాదేవీలు జరపాలని చెప్పారు. మున్సిపాలిటీలో మొత్తం 1500 మంది చిరువ్యాపారులకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. యూపీఏ మేనేజరు ధనంజయ్ ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చెక్కు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

కంచిలి: శ్రీకంచమ్మ తల్లి రైతు ఉత్పత్తి సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేసి ఇటీవల మృతి చెందిన దన్నాన రవి కుటుంబానికి అఖిల భారతీయ రోజ్‌గారి ప్రముఖ్ (భారతీయ కిసాన్ సంఘ్) హుబ్లీ కేంద్రం వారు రూ.3.27 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని సంస్థ ప్రముఖులు మృతుని భార్య కెల్లా శ్రావణికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అభివృద్ధి కోసం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా దన్నాన రవి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వారాహి చైర్మన్ డి.వి.రమణమూర్తి, విశాఖపట్నంకు చెందిన విశ్రాంత జాయింట్ కలెక్టర్ పేరి రామకృష్ణ, వారాహి డైరెక్టర్, విశాఖపట్నంకు చెందిన విశ్రాంత శాస్త్రవేత్త అశోక్‌కుమార్, అఖిల భారతీయ రోజ్‌గారి ప్రముఖ్ జలగం కుమారి స్వామి, కంచిలి ఎఫ్‌పీసీ చైర్మన్ గునిశెట్టి కృష్ణారావు, తెప్పల రవి, కనుగుల సత్యం, జిల్లా ప్రచారక్ మాధవ్, బాలకామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో సమస్యలు పరిష్కరించాలి

- శాసన మండలిలో ఎమ్మెల్సీ రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బారువ, ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రుల్లో సమస్యలు నెలకొవడంతో మెరుగైన వైద్యం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శనివారం శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. బారువ మేజర్ పంచాయతీలో గత ప్రభుత్వం ఆరుకోట్ల అరవై లక్షల రూపాయలు వెచ్చించి 30 పడకల ఆస్పత్రి నూతన భవన సముదాయం నిర్మాణ పనులు ప్రారంభించి 90 శాతం పనులు పూర్తి చేసిందన్నారు. మిగిలిన పది శాతం పనులు పూర్తిచేస్తే సముద్ర తీర ప్రాంత గ్రామాలకు చెందిన వేలాది మంది మత్స్యకారులకు వైద్య సదుపాయం అందుతుందన్నారు. ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసి తీర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, పాత భవనాల సముదాయాన్ని కిడ్నీ రోగుల కోసం డయాలసిస్ కేంద్రంగా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో కిడ్నీ రోగుల ప్రాణాలు గాల్లో దీపాలుగా ఉన్నాయన్నారు. డయాలసిస్ కేంద్రంలో జనరేటర్ పనిచేయడం లేదని, డయాలసిస్ జరుగుతున్నప్పుడు విద్యుత్ సరఫరా నిలిచి పోతే 30 నిమిషాలు మాత్రమే ఇన్వర్టర్ సపోర్టు చేస్తుందన్నారు. 30 నిమిషాల్లో విద్యుత్ సరఫరా కాక పోతే రోగి ప్రాణాలకే ప్రమాదం వస్తుందని సభ దృష్టికి తీసుకొచ్చారు. సామాజిక ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంటు పనిచేయడంతో రోగులకు ఇబ్బందిగా మారిందన్నారు.

'రాజకీయ స్వార్థం పవన్ నోరు కట్టేసింది'



సింగుపురం మోహన్‌రావు

టెక్కలి: టాలీవుడ్ ప్రముఖులను గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లడంలో సినీనటుడు చిరంజీవి చేసిందేమీ లేదని అసెంబ్లీలో బాలకృష్ణ తీసిపారేయడం.. ఆ సందర్భంగా చిరంజీవిని వాడు అన్నట్లుగా సంబోధించడం దారుణమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సింగుపురం మోహన్‌రావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తన సొంత అన్నను బాలకృష్ణ తీవ్రంగా అవమానించినప్పటికీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ స్పందించకపోవడం అంతకంటే దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఆయన రాజకీయ స్వార్థంతోనే మౌనం వహిస్తున్నారన్నారు. సొంత అన్న కంటే రాజకీయమే ఎక్కువా అని కాపు సోదరులు ప్రశ్నిస్తున్నారన్నారు. అలాగే ప్రజా సేవకుడిగా, ఐదేళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించి బాలకృష్ణ అసెంబ్లీ వేదికగా సంస్కారహీనంగా మాట్లాడడం తగదన్నారు. తక్షణమే బాలకృష్ణ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని లేకపోతే ప్రజాగ్రహం తప్పదని మోహన్‌రావు అన్నారు.